www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 అక్టోబర్ 2023

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి -తిరుమల



తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురార్పణ జరిగింది. 15 నుంచి 24వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. గరుడవాహనసేవ రాత్రి 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. శనివారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం కార్యక్రమం నిర్వహించారు.అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయ్యింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి

ప్రసంగిస్తున్న ధనలక్ష్మి

వేదికపై సిపిఎం కేంద్రకమిటి సభ్యులు మరియం థావలే, సామాజిక కార్యకర్త వసుంధర

మరియం థావలేకు స్వాగతం పలుకుతూ...

2024నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

స్కీం వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి / సిపిఎం రాష్ట్ర మహిళా సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'మహిళలంటే తనకు ఎనలేని గౌరవమని, అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని నిత్యం ప్రగల్భాలు పలికే సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళాభివృద్ధికి ఓ 'బటన్' నొక్కాలి' అని సిపిఎం రాష్ట్ర మహిళా సదస్సు డిమాండ్ చేసింది.. నవరత్నాలు ఇస్తున్నట్లే స్కీం వర్కర్లకు కనీస వేతనం 26వేలు ఇస్తూ బటన్ నొక్కాలన్నారు. దిశ చట్టానికి దశ దిశ లేకుండా పోయిందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్న బిజెపికి ఒక్క ఓటు వేసినా చేటేనని సదస్సు ఉద్ఘాటించింది. మోడీకి చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్‌ను 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'అసమానతలు లేని అభివృద్ధి' నినాదంతో తిరుపతి టిఎంఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర మహిళా సదస్సు సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. సదస్సుకు సిపిఎం జిల్లా కమిటి సభ్యురాలు పి.సాయిలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిపిఎం కేంద్రకమిటి సభ్యురాలు మరియం థావలే ప్రసంగించారు. సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్న కేంద్రంలోని బిజెపికి ఓటు వేస్తే మహిళలు వంటింటికే పరిమితమయ్యే ప్రమాదం ఉందన్నారు. బిజెపి హఠావో.. దేశ్‌కో బచావో అంటూ నినదించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు మోడీ పూనుకుంటే, అక్కడి ప్రజలు స్టీలుప్లాంట్‌ను రక్షించుకునేందుకు వెయ్యి రోజుల పైగా స్టీల్‌ప్లాంట్ ఉద్యమం చేయడాన్ని ప్రశంసించారు. దేశంలో ఆకలి సూచి పెరిగి, ప్రజలకు పౌష్టికాహారం లోపించి, రక్తహీనతతో బాధపడుతున్నారని, అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నేషనల్ సర్వే లెక్కలను సైతం దాచి పెడుతోందన్నారు. సామాజిక కార్యకర్త కె.వసుంధర మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. మహిళా సాధికారిత కావాలంటే విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆరోగ్యం, రాజకీయ అధికారం, సాంఘిక సంక్షేమం కీలకమన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకొస్తామని చెప్పిన సిఎం జగన్మోహన్‌రెడ్డి, లిక్కర్ బావరేజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 25 సంవత్సరాలు మద్యం పాలసీని తాకట్టు పెట్టి వారిచ్చే డబ్బుతో నాడు-నేడు, అమ్మఒడి, ఆసరా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చంద్రయాన్ -3 విజయవంతమైన రోజే ఓ బాలిక అత్యాచారానికి గురై తీవ్ర రక్తస్రావంతో ఆదుకోవాలని వీధుల్లో అచేతన స్థితిలో తిరిగినా స్పందించలేని దౌర్భాగ్య స్థితిని మోడీ తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ ఆస్పత్రులకు కోట్లు కుమ్మరిస్తున్న జగన్‌ప్రభుత్వం, పిహెచ్‌సిలను కార్పొరేట్ స్థాయికి ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, సుబ్బరావమ్మ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు అధికమయ్యాయన్నారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో సాక్షాత్తు ముఖ్యమంత్రులు, మంత్రులే నిందితులకు వత్తాసు పలుకుతూ మహిళలకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారని కొన్ని ఘటనలను వివరించారు. సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు డి.ధనలక్ష్మి మాట్లాడుతూ సనాతనం వైపా, సమసమాజం వైపా అన్నది మహిళలు తేల్చుకునే సమయం ఆసన్నమయ్యిందన్నారు. సనాతనం కావాలనుకునే మహిళలంతా భర్తలు చనిపోతే సతీసహగమనం చేయడం, వారి పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చేస్తారా? అని ప్రశ్నించారు.

సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, రాయపనేని హరిక్రిష్ణలు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం, సమసమాజం కోసం మహిళలు చేసే ఏ పోరాటానికైనా తమ సంఘీభావం ఉంటుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి పాటలు అందరినీ అలరించాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సమసమాజ దిశగా వక్తల ప్రసంగాలతో మహిళా రాష్ట్ర సదస్సు విజయవంతంగా ముగిసింది.

అభివృద్ధి నిరోధకులను అడ్డుకుంటాం

టిటిడి ఉద్యోగసంఘాల మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



కరుణాకర్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్న ఉద్యోగసంఘాలు

తిరుపతిలో సుమారు లక్ష మంది టీటీడీ, అనుబంధ సంస్థల రెగ్యులర్, కాంట్రాక్టు, కార్పొరేషన్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారని, తిరుపతిలో సుమారు 50 శాతం టీటీడీ ఆస్తులు ఉన్నాయని, టీటీడీ బడ్జెట్ లో ఒక్క శాతం నిధులు తిరుపతి అభివద్ధికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి తాము అండగా ఉంటామని టీటీడీ లోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే శక్తులను బహిరంగంగా అడ్డుకుంటామని వారు చెప్పారు.ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడం పట్ల శనివారం సాయంత్రం వారు చైర్మన్ ను ఆయన నివాసంలో కలసి కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట సుమారు 650 ఎకరాల భూమి సమీకరించి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కరుణాక రెడ్డి కే సాధ్యం అయ్యిందని వారు చెప్పారు. టీటీడీ బడ్జెట్ లో తిరుపతి అభివద్ధికి 1 శాతం నిధులు కేటాయించడాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం ఒకరిద్దరు రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం దురదష్టకరమన్నారు. ఈ అభివద్ధి టీటీడీ ఉద్యోగులకు, యాత్రీకులకు ఉపయోగకరమన్నారు. పారిశుధ్య కార్మికులకు 5 వేల దాకా, కార్పొరేషన్ ఉద్యోగులకు 3 శాతం జీతం పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారనిఅభినందించారు. టిటిడి చైర్మన్ కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల తనకున్న ప్రేమ, అభిమానం వల్లే తాను ఈ నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ఉద్యోగులందరికీ ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి లోని టీటీడీ ఆస్తులపైన మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయ కూడా పన్ను వేయడం లేదనే విషయం కూడా అందరూ గుర్తించాలని కోరారు. అలాగే టీటీడీ సంస్థలు, నివాస ప్రాంతాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి అభివద్ధి, భక్తుల సదుపాయాల అభివద్ధి విషయాల్లో టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ పరస్పర సహకారంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

తిరుపతి వ్యతిరేకి బిజెపి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దేశవ్యాప్తంగా నిధులు వెల్లువలా తరలిపోతుంటే నోరు మెదపని బిజెపి, తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు ఒక్క శాతం కేటాయిస్తే తల్లడిల్లిపోతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో విమర్శించారు. తిరుపతి నగరం అభివృద్ధి చెందడం అంటే టిటిడి అభివృద్ధి కావడమేనని, నగరం ఎంత విస్తరిస్తే టిటిడికి అంత లాభదాయకమని అన్నారు. పెరటాసి మాసంలో రెండు లక్షల మంది భక్తులు కొండమీదకు వస్తే నిర్వహించలేక అధికార యంత్రాంగం భీతిల్లిన మాట వాస్తవమని, తిరుపతి నగరంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వినోదాత్మక కార్యక్రమాలు పెరగాల్సిన అవసరాన్ని సూచిస్తోందన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు మున్సిపాలిటీలకు ఇస్తున్నది రుణమే కాని కేంద్రం దయాదాక్షిణ్యం కాదన్నారు. దేశంలోని అన్ని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఇచ్చారన్న వాస్తవాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. తిరుపతి నగరాభివృద్ధికి కేంద్రం అదనంగా ఇచ్చింది ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. తెలుగుదేశం, వైసిపి, జనసేనలతో అపవిత్ర బంధాన్ని బిజెపి ఏ పద్ధతిలో సాగిస్తుందో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసన్నారు. టిటిడి చట్టానికి వ్యతిరేకంగా తిరుపతి అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని, చట్టానికి లోబడే ఈ నిధులు కేటాయించిన వాస్తవాన్ని అర్థం చేసుకోవాలన్నారు. తిరుపతికి టిటిడి కేటాయించే నిధులు శాశ్వతం కావాలని, చట్టరూపంలో రావాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

రేషన్ ... పరేషాన్...!

మొరాయిస్తున్న సర్వర్ / ఒక్కో కార్డుకు 5-15 నిముషాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైసీపీ సర్కార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానం (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. " కొండ నాలుకకు మందేస్తే..ఉన్న నాలుక ఊడినట్లు" తయారైందన్న విమర్శలు వస్తున్నాయి. రేషన్ పంపిణీ కోసం ప్రభుత్వం వినియోగిస్తున్న సర్వర్ తరచూ మొరాస్తుండటంతో ఆపరేటర్లతో పాటు లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒక్కో కార్డుకు 5 నుంచి 15 నిముషాల సమయం పడుతుండటంతో సర్వర్ మరీ ప్రహసనంగా మారుతోందంటూ ఆపరేటర్లు, లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో 15 రోజుల్లో పూర్తి చేయాల్సిన రేషన్‌ను నెలాఖరుకైనా పూర్తి చేయలేకున్నామని ఆపరేటర్లు వాపోతున్నారు. సర్వర్ తీరు ఇలా ఉంటే మధ్యలో డబుల్ థంబ్ విధానం కూడా ఆపరేటర్లకు, లబ్ధిదారులకు చికాకులు తెచ్చిపెడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అసలే సర్వర్ పనిచేయదు..ఆపై రెండేసి సార్లు థంబ్ వేయాలంటే అయ్యే పనికాదని ఆపరేటర్లు వాపోతున్నారు. ఫలితంగా తాము లబ్ధిదారుల చేత చీవాట్లు తినాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మొరాయిస్తున్న సర్వర్

పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ విధానాన్ని జగన్ సర్కార్ 2021లో ప్రవేశపెట్టింది. ఈ విధానంపై డీలర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా ముందుకే వెళ్లింది. దీంతో డీలర్లు నామమాత్రంగా మారగా, ఎండీయూ ఆపరేటర్లు కీలకంగా మారారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు సర్వర్ వ్యవస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే సర్వర్ తరచూ మొరాయిస్తుండటం, కొన్ని సార్లు నెట్‌వర్క్ స్లోగా నడుస్తుండటంతో ఎండీయూ ఆపరేటర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఒక్కో ఆపరేటర్ పరిధిలో 1500 నుంచి 2 వేల కార్డులు ఉంటాయి. ఈ కార్డులకు ప్రతి నెలా 15వ తేదీ లోగా రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్నిసార్లు సర్వర్ పూర్తిగా పనిచేయకపోవడంతో రోజుకు కనీసం పది కార్డులకు కూడా తాము సరుకులు పంపిణీ చేయలేకపోతున్నామని ఆపరేటర్లు వాపోతున్నారు. అక్టోబర్ నెల మొదలై నేటికి 15 రోజులు గడిచి పోతోంది. ఇప్పటికి 25 శాతం కార్డులకూ తాము రేషన్ సరుకులు అందజేయలేదంటే సమస్య తీవ్రతేంటో అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 366 మంది ఎండీయూ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. సుమారు 6 లక్షల తెల్లరేషన్ కార్డుదారులున్నారు. ఒక్క రోజు రేషన్ సరఫరా చేయాలంటే హమాలీ నుంచి కూలీ వరకు రూ.వెయ్యి ఖర్చువుతోంది. ఈ లెక్కన తాము నెలంతా రేషన్ సరఫరా చేసుకుంటూ పోతే తమ సంపాదనంతా కూలీలకే సరిపోతుందని ఆపరేటర్లు వాపోతున్నారు. అదీ కాకుండా సర్వర్ స్లో అవ్వడం వల్ల ఒక్కో కార్డుకు రేషన్ సరఫరా చేసేందుకు కనీసం 10 నిమిషాల సమయమైనా పడుతోందనీ, దీంతో లబ్ధిదారులు విసుగు చెంది ఛీవాట్లు పెడుతున్నారంటూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఉపాధి కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులు ఎంతో వ్యవప్రయాసలకోర్చి రేషన్ కోసం వస్తున్నారనీ, తీరా సర్వర్ మొరాయిస్తుండటంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

- డబుల్ థంబ్‌లతో గొప్పలు

ఒక వైపు సర్వర్ సమస్యతో ఎండీయూ విధానం ప్రహసనంగా మారుతోంటే..ఇంకో వైపు డబుల్ థంబ్‌లు పెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ గొప్పలకు పోతూ లబ్ధిదారులకు చికాకు తెప్పిస్తున్నారని ఆపరేటర్లు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సాధారణంగా లబ్ధిదారుడు రేషన్ పొందాలంటే ఒక సారి థంబ్(వేలి ముద్ర) వేయాల్సి ఉంటుంది. ఆ వేలిముద్ర సరిపోలేందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతుంది. అయితే తాజాగా కేంద్రం ప్రజా పంపిణీ వ్యవస్థలో తన ముద్రను చాటుకునేందుకు లబ్ధిదారుల చేత రెండో సారి కూడా థంబ్ వేయించుకుంటోంది. దీంతో మరింత సమయం కార్డులకు పడుతోంది. ఈ విధానం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆపరేటర్లు మండిపడుతున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జనసేన, టిడిపి, సిపిఐ నాయకులు

పోలీసులపై ప్రైవేటు కేసులు వేస్తాం : జనసేన

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

పోలీసులు సెక్షన్ 307ను అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జనసేన, టిడిపి, సిపిఐ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా పథకం ప్రకారం హత్య చేయాలని ప్రయత్నిస్తే పెట్టాల్సిన సెక్షన్ 307 కేసును ప్రెస్ మీట్ పెట్టిన మహిళలపై పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతుండగానే పోలీసులు లోపలికి ప్రవేశించి వారిని అదుపులోకి తీసుకుంటే పోలీసులపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ కేసు పెట్టడం దారుణమన్నారు. గతంలో విశాఖ పట్నంలోనూ వాటర్ బాటిళ్లు విసిరారని 92 మంది జనసైనికులపై హత్యాయత్నం కేసులు నమోదు చేస్తే... న్యాయమూర్తి 9 మందికి మాత్రమే రిమాండ్ విధించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టిడిపికి చెందిన వెయ్యి మందిపై కేసులు పెడితే అందులో సింహభాగం హత్యాయత్నం కేసులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వేపనపల్లిలో ఫీజు రీఎంబర్స్ మెంట్ అడిగినందుకు కొంత మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారన్నారు. జిల్లాలో సెక్షన్ 307ను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసులు వైసీపీని కాకుండా ఐపీసీని ఫాలో అవ్వాలని కోరారు. అధికార పార్టీ నాయకులు తల పగలకొడితే హత్యాయత్నం కేసులు నమోదు చేయని పోలీసులు... తమ నాయకులు, కార్యకర్తలపై మాత్రం ఎలాంటి ఆధారాలు లేకుండానే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. చివరకు దిష్టిబొమ్మలు దగ్ధం చేసినా 307 కేసులు పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో హత్యాయత్నం కేసులను దుర్వినియోగం చేస్తున్న పోలీసులపై ప్రవేటు కేసులు వేస్తామన్నారు. అలాగే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రితో పాటు సుప్రీం కోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు. టిడిపి నేత గాలి భానుప్రకాష్‌పై దాడిని ఖండించారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ప్రత్యేక లోక్ అదాలత్ ఈనెల 21న జరగనుందని, విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు కోర్టు ఆవరణలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులతో శనివారం సమావేశం జరిగింది. జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ రెవెన్యూ కేసులపై సబ్‌కోర్టు పరిధిలో ప్రతి మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసులు వాటిపై పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు తహశీల్దార్ పరమేశ్వరస్వామి, కార్వేటినగరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీపతి, నగరి తహశీల్దార్ అమరేంద్రబాబు, నింద్ర, ఆర్‌సిపురం, విజయపురం, వడమాలపేట తహశీల్దార్లు, ప్రభుత్వ న్యాయవాది ఉదయ్‌కుమార్, సంజీవి, మురగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

శివయ్యా... నీవే సాక్ష్యం..!

సెల్‌ఫోన్ టార్చి వెలుతురులో రాహుకేతు పూజలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చీకట్లో రాహుకేతు పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాహు కాల సమయంలో ఓ గంట పాటు శివయ్య భక్తులకు కరెంటు కష్టాలు వచ్చాయి. రెండవ శనివారంతో పాటు మహాలయ అమావాస్య కావడంతో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రెండవ శనివారం కావడంతో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ శాఖ వారు సరఫరా ఆపేశారు. ఈ సమయంలో ఆలయం వద్ద ఉన్న జనరేటరు పని చేయక పోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో రాహు-కేతు మండపాల్లో ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ లేక పోవడంతో రాహు-కేతు మండపాలు చీకటి కమ్ముకున్నాయి. కొంతమంది భక్తులు మండపాల్లో పని చేసే ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది భక్తులు రాహు కాల సమయం దాటి పోకుండా తమ సెల్‌ఫోన్లలో టార్చ్ లైట్లు ఆన్ చేసుకుని పూజలు ముగించుకోవడం జరిగింది. గంట తరువాత ఆలయ అధికారులు జనరేటరు మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో భక్తులు, ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రతి నెలా రెండవ శనివారం ఇలా విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతుందని అంతా తెలుసు. అయినా ఆలయ అధికారులు జనరేటర్ పనిచేస్తుందో లేదో ముందస్తుగా సరిచూసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగానే ఇలాంటి సమస్య వచ్చిందంటూ భక్తులు మండిపడ్డారు.

'కోత'ల్లోనూ కోతలే..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అసలే ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విద్యుత్ చార్జీలు, పైగా అదనపు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు రకరకాల పేర్లతో మరో బాదుడు. దీనికి తోడు ఇష్టానురాజ్యంగా విద్యుత్ కోతలు. పట్టణాల్లో సైతం తప్పని అంతరాయాలు. డిస్కం పరిధిలో ప్రతి ఊర్లోనూ రోజూ కోతలు ఉన్నా.. అబ్బే అవేమి లేవే, నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ అధికార యంత్రాంగం కోతలు కోయడం గమనార్హం. ప్రభుత్వంలో మార్పు రాకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదంటూ వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి.

ఏపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి కేంద్రంగా పని చేస్తూ ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు విద్యుత్ సరఫరా అందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ. లక్షా 18,119 కిలోమీటర్ల విస్తీర్ణంలో 94,12,063 డొమెస్టిక్ సర్వీసులు, 10,00,777 నాన్ డొమెస్టిక్ అండ్ కెమికల్ సర్వీసులు, 74,784 ఇండస్ట్రీయల్ సర్వీసులు, 17,097 కాటేజీ ఇండస్ట్రీస్ అండ్ దోబీఘాట్స్ సర్వీసులు, 14,75,846 వ్యవసాయ కనెక్షన్లు, 11,7829 పిడబ్ల్యుఎస్, స్ట్రీట్‌లైట్ సర్వీసులు, 82,955 జనరల్ పర్పస్ సర్వీసులు, 55,320 ఆక్వా, అనిమల్ హస్‌బెండ్రీ అండ్ అదర్ సర్వీసులు, 1,026 టెంపరరీ సర్వీసులు, 1,22,37,597 ఎల్‌టిసర్వీసులు, 7,116 హెచ్‌టి సర్వీసులకు విద్యుత్ సరఫరా చేస్తూ, 2228 33/11 కెవి సబ్‌స్టేషన్లు, 784330 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 8589 11కెవి ఫీడర్స్, 48 డివిజన్లు, 166 సబ్‌డివిజన్లు, 648 సెక్షన్లతో, 132 ఈఆర్వోస్, సబ్ ఈఆర్వోస్ సామర్థ్యంతో పని చేస్తున్న సంస్థ. ప్రజలందరికి విద్యుత్ సరఫరా అందించడంలో ఎస్‌పిడిసిఎల్ సిబ్బంది నిరంతరాయంగా పని చేస్తోంది. కానీ ప్రభుత్వ ధోరణి, అధికారులు తీరు వల్ల ప్రజలకు కరెంట్‌తో కష్టాలు తప్పడం లేదు. పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు 2016లో వాడిన కరెంట్‌కు సైతం ట్రూఅప్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో అధిక భారాలు మోపుతున్నారు. అరాకొర అనుకుంటే పోరబాటే. 200, 300 రూపాయలు నెల బిల్లు వచ్చే గృహ వినియోగదారులకు మూడు రెట్లు ఎక్కువగా రూ.700 నుంచి రూ.900 రూపాయలు కరెంట్ బిల్లు వస్తుంది. కరెంట్ పట్టుకుంటే షాక్ కొట్టడం మాట దేవుడెరుగు. ఇపుడు కరెంట్ బిల్లు పట్టుకుంటేనే వినియోగదారులకు షాక్ కొడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని జబ్బలు కొట్టుకుంటున్న అధికారులు గత కొంతకాలంగా అనధికార కోతలు విధిస్తుండడం శోచనీయం. మారుమూల ప్రాంతాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కాదు సుమా ఏకంగా పట్టణాలు, నగరాల్లోనూ రోజుకు ఐదు గంటల మేర అనధికార విద్యుత్ కోతలు పెడుతుండడం గమనార్హం.

ఒక పక్క చార్జీల భారం, మరోపక్క కరెంట్ కోతలు తప్పడం లేదు. ఇదేమని ఏకంగా డిస్కం చైర్మన్‌ను ప్రశ్నిస్తే విద్యుత్ కోతలనేవి లేవు అంటూ కోతలు కోస్తుండడం విడ్డూరం. ఫలాన ప్రాంతాల్లో..ఫలానా సమయం కరెంట్ లేదని సాక్ష్యాధారాలతో నిరూపిస్తే..'అది విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది, చెట్లు కొడుతుండడం వల్ల కరెంట్ కొద్ది సమయం నిలిపేశారంటూ' కప్పదాటు సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు. ఎక్కడైన సమస్య ఉంటే 1912కు ఫిర్యాదు చేయండి, వెంటనే పరిష్కరిస్తామంటూ వినియోగదారులను మెప్పించే ప్రయత్నం చేస్తుండడం కొస మెరుపు. వాస్తవానికి విద్యుత్ వినియోగానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి లేక డిస్కంలు ప్రత్యామ్నాయ మార్గాల బాట పట్టాయి. వినియోగదారుల దృష్టి మళ్లించేందుకు అనధికార కోతలకు సిద్ధమయ్యాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక పక్క అదనపు బాదుడు, మరో పక్క అనధికార కోతల వల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కరెంట్ చార్జీలను నియంత్రించి, వినియోగదారులకు న్యాయం చేయాలంటూ వామపక్ష పార్టీలు ఏకమై పోరుబాట పట్టాయి. ప్రభుత్వ ధోరణిలోనూ, అధికారుల తీరులోనూ మార్పు రాకపోతే మరో బషీర్‌బాగ్ ఘటన తప్పదని హెచ్చరిస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అదనపు బాదుడు తగ్గిస్తుందని వినియోగదారులు వేచి చూస్తున్నారు.

మానసిక ధైర్యంతోనే క్యాన్సర్ నిర్మూలన : విసి

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి - క్యాంపస్ : మానసిక ధైర్యంతోనే క్యాన్సర్ నిర్మూలించవచ్చని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య డి భారతి పేర్కొన్నారు. వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్, హెల్త్ సెంటర్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా శుక్రవారం ఇంజినీరింగ్ కళాశాలలోని ధృతి కాన్ఫరెన్స్ హాల్‌లో 'నేషనల్ పాలియేటివ్ కేర్ డే అండ్ బ్రెస్ట్ క్యాన్సర్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య భారతి మాట్లాడుతూ మానసిక ధైర్యం, కచ్చితమైన అవగాహనతో క్యాన్సర్‌ని నిర్మూలించవచ్చున్నారు. క్యాన్సర్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా టాటా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ పనిచేస్తోందన్నారు. కేన్సర్ బాధితులకు నాణ్యమైన పరికరాలతో ఉచిత సేవలు అందిస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడు తోంద న్నారు. మహిళల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో టాటా సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వ్యాపిస్తున్న క్యాన్సర్‌లలో బ్రెస్ట్ క్యాన్సర్ మొదటి స్థానంలో ఉందన్నారు. మనిషి జీవన శైలి, జన్యువులు, పర్యా వరణ ప్రభావం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ సభ్యులు క్యాన్సర్ రోగులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని సూచిం చారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు రవికిరణ్, సంధ్య మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుర్తించాల్సిన విధానాలను వివరించారు. స్టూడెంట్ రిలేషన్స్ డీన్ ఆచార్య కాత్యాయిని, హెల్త్ సెంటర్ అధికారి అనన్య మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ బారిన పడినా ధైర్యంగా ఎదుర్కొంటే సులువుగా బయటపడవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాభవాని, ఆంగ్ల విభాగం ఆచార్యులు వై శారద, నిర్మల, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లు అందించండి..!

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాల్టీ పరిధిలోని 25వవార్డులోని కాంపాళెం దళిత వాడలో మున్సిపాలిటీ అధికారులు నీళ్లు వదడం లేదని 'మాకు నీళ్లు అందించండి...' అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గత కొన్ని నెలలుగా తమకు మున్సిపాల్టీ అధికారులు నీళ్లు వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు ఎందుకు వదలడం లేదని అధికారులను నిల దీయగా మున్సిపాలిటీ అనుమతులు తీసుకోలేదని కుళాయి పన్ను కట్టాలని కట్టే వరకు నీళ్లు వదిలేది లేదని అధికారులు తెల్చిచెబుతున్నారన్నారు. తమ వద్ద మున్సిపాలిటీ సిబ్బంది మనిషికి 2వేల రూపాయలు తీసుకొని ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చారన్నారు. తమకు అనుమతులపై అవగాహన లేక పోవడంతో దళా రులు నగదు తీసు కొని దొంగ కనెక్షన్ ఇచ్చారన్నారు. నెలలు గడుస్తున్నా మంచినీళ్లు వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పడి గాపు లు కాసి ఓట్లు వేయించు కుంటారని ఈ సారి తమకు మున్సిపల్ నీటిని అందించే వరకు నాయకులెవరినీ రానివ్వబోమని మహిళలు చెప్పారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

పొక్కాలమ్మ ఆలయానికి సర్పంచ్ భారీ కానుక

- 9 లక్షలు విలువైన వెండి వస్తువులు బహూకరణ

వెండి సామగ్రిని అందిస్తున్న తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు గ్రామదేవత పొక్కాలమ్మ ఆలయానికి స్థానిక సర్పంచ్ కే రామచంద్రారెడ్డి దంపతులు రూ.9 లక్షల విలువైన వెండి సామగ్రి కానుకగా శనివారం అందించారు. 6 కేజీల వెండితో తయారుచేసిన అమ్మవారికి కిరీటం, నాగపడగ, త్రిశూలం ఇతర పూజ సామగ్రి కానుకగా అందించారు. ఆలయ ప్రాంగణంలో 250 కేజీలతో తయారు చేసిన భారీ త్రిశూలాన్ని ఆలయానికి బహూకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి త్రిశూలాన్ని ప్రతిష్టించారు. పొక్కాల అమ్మవారు కిరీటం, త్రిశూలం, నాగ పడగ అలంకరించారు. దాత సర్పంచ్ కె.రామచంద్ర రెడ్డిని ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి సన్మానించి అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, యోగానంద రెడ్డి, పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఉపేంద్ర రాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ. ఉపేంద్రరాజుకు వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎన్ క్రిప్షన్ ఆల్గారిథం ఇన్ రివర్స్ బుల్ డేటా హైడింగ్ యూజింగ్ వేవలెట్ ట్రాన్స్ ఫామ్స్ అండ్ కన్వల్యూషన్ న్యూరల్ నెట్‌వర్క్' అనే అంశంపై డాక్టర్ ఎన్ ఆముదప్రభ పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు విట్ యూనివర్సిటీ వేలూరు వారు ఉపేంద్రరాజుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉపేంద్ర రాజుకు డాక్టరేట్ రావడం పట్ల సహచర అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సుగుణమ్మకు తగునా? : వైసిపి

మాట్లాడుతున్న వైసిపి నాయకురాలు సాయి కుమారి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి వాసిగా ఉంటూ మునుపెన్నడూ లేని విధంగా ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు ఎందుకంత అక్కసు అర్థం కావడం లేదని వైసిపి మహిళా నాయకురాలు సాయి కుమారి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీటీడీ నిధులు తిరుపతి అభివృద్ధిలో భాగంగా ఖర్చు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలే తప్ప వ్యతిరేకించడం సుగుణమ్మ అవివేకానికినిదర్శనమన్నారు. తిరుపతి ఎమ్మెల్యేగా తిరుపతిలో ఎటువంటి అభివృద్ధి చేశారో సుగుణమ్మ చెప్పాలని డిమాండు చేశారు. తిరుపతి అభివృద్ధికి ఎంతో ముందు చూపుతో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ఎంతో వ్యూహాత్మకంగా పనిచేస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్లను వేసి తిరుపతి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని సుగుణమ్మ అభివృద్ధికి నిరోధకంగా మారుతున్నారన్నారు. ఇకనైనా అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పునీత, శాంత రెడ్డి, పుష్ప యాదవ్, గీతా యాదవ్, పద్మజ పాల్గొన్నారు.

నిధి-ప్రయాస్ సెంటర్ ప్రయాసీలకు నిధులు పంపిణీ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ పద్మా వతి మహిళా విశ్వ విద్యా లయంలో ఎస్-ఎస్ఐఐఈ - టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ కు, డిపార్టుమెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నిధి-ప్రయాస్ సెంటర్ (పిసి) ని మంజూరు చేసింది. దీని ప్రధాన లక్ష్యం 'వినూత్న ఆలోచనను నమూనాగా అనువదించడానికి వీలు కల్పించడం, ప్రయాస్ కింద ప్రతి ప్రయాస్ కేంద్రానికి ఐదేళ్ల పాటు సహాయం అందిస్తారు. నిధి ప్రయాస్ నిర్వహించడానికి ఎంపిక చేసిన 14 కేంద్రాలలో ఎస్ పిఎమ్ వివి టిబిఐ మొదటి సంవత్సరం నిధులలో భాగంగా ప్రత్యేక ఫ్యాబ్ ల్యాబ్ ఏర్పాటు, ఆవిష్కర్తలకు విత్తన నిధులు అందించేందుకు రూ.2.20 కోట్లు మంజూర య్యాయి. ఈ చొరవలో భాగంగా, ఆరోగ్య సంరక్షణ, ఆహార సాంకేతికత, క్లీన్ టెక్, బయోటెక్నాలజీ, ఇంజినీరింగ్, ఐటి మొదలైన డొమైన్‌లలో దేశవ్యాప్తంగా అందిన అనేక దరఖాస్తుల నుండి 15 మంది సభ్యులు నిధి-ప్రయాసీలుగా ఎంపికయ్యారు. వీరికి దాదాపు రూ.90 లక్షలు 3 విడతలలో లభిస్తుంది. వర్సిటీ ఉప కులపతి ఆచార్య డి.భారతి, రిజిస్ట్రార్, ఆచార్య ఎన్. రజని ఎంపికైన ప్రయాసీలందరినీ అభినందించారు. ఎస్ఎస్ఐఐఈ కార్యదర్శి ఆచార్య ఎస్. జ్యోతి, ఎస్ఎస్ఐఐఈ - టిబిఐ సిఈఓ డా. జే. సూర్య కుమార్, సమక్షంలో ఎనిమిది మంది ప్రయాసీలకు మొదటి విడత నిధులను వైస్ ఛాన్సలర్ పంపిణీ చేశారు. నిధి-ప్రయాస్ కేంద్రం కార్యక్రమ లక్ష్యాలను సమర్థవంతంగా సాధిస్తుందని ఆచార్య డి.భారతి విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక, ప్రపంచ సవాళ్లను పరిష్కరించే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఈ ప్రయాసీలు కీలక పాత్ర పోషిస్తారు. ఇంకా, ఈ కేంద్రం ఆవిష్కర్తలు, విద్యాసంస్థలు, సలహాదారులు, ఇంక్యుబేటర్‌ల మధ్య కనెక్షన్‌లను సులభతరం చేయడం ద్వారా డైనమిక్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

నేదురుమల్లి పద్మనాభ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి- చిట్టమూరు: మండలంలోని వైసిపి నాయకులు వాకాడు లో శనివారం నిర్వహించిన ఏఐసీసీ మాజీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు నేదురుమల్లి పద్మనాభ రెడ్డి పెద్దకర్మ క్రియల్లో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొడవలూరు సుబ్బారెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల్ బాబు యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు పనబాకా కృష్ణయ్య, వైసిపి నాయకులు కోటిరెడ్డి మధు రెడ్డి, వంకా రామాంజనేయులు, చిట్టమూరు మాజీ జడ్‌పిటిసి వంకా రమణయ్య, మాజీ సర్పంచ్ దేవరెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : జవహర్ నవోదయ విద్యాలయల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు అక్టోబర్ 31 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యన్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని,11వ తరగతికి దరఖాస్తు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ తరగతులకు దరఖాస్తు చేసుకునేందుకు 2023 - 24 విద్యా సంవత్సరం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుండి 2009 జూలై 31 మధ్యన జన్మించి ఉండాలని, పరీక్షా తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

దసరా పండుగ ముసుగులో జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి -సత్యవేడు: దసరా పండుగ ముసుగులో ఎవరైనా జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా సత్యవేడు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం దసరా సెలవులు నేపథ్యంలో పిల్లలపై వారి తల్లిదండ్రులు ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం సేవించి డ్రైవింగ్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ముఖ్యంగా యువత దూరంగా ఉండాలన్నారు. దసరా సెలవుల్లో పలు పర్యాటక ప్రాంతాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవల కొందరు యువకులు పర్యాటక కేంద్రాలకు వెళ్లి అక్కడ సిబ్బంది కళ్లు కప్పి మద్యం తాగి వాటర్ ఫాల్స్ లో దూకడం వల్ల మృతి చెందుతూ ఆందోళన కలిగించి తల్లిదండ్రులకు తీరని ఆవేదన మిగుల్చుతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని చిన్నతనం నుంచి పిల్లలను క్రమ శిక్షణతో పెంచాలన్నారు. దసరా ముఖ్యమైన పండుగ ముగిసేవరకు పండుగను కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.

మైక్రోబయాలజిస్ సదస్సు బ్రౌచర్ ఆవిష్కరణ

సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ విసి డి భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, డిపార్టుమెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రో బయాలజీ అండ్ బయోటెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 22- 23,2023 నిర్వహించబోయే అంతర్జాతీయ సదస్సు 'బయోటెక్ మైక్రోన్ : షాపింగ్ ద సస్టైనబుల్ ఫ్యూచర్ " అనే అంశంపై బ్రౌచర్ ను ఉప కులపతి ఆచార్య డి. భారతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య డి.భారతి మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధకులు తమకున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమమైన సమాచారాన్ని అందించే పరిశోధనలు సమాజానికి అందించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు తోడ్పడుతుందన్నారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనడం ద్వారా నాణ్యమైన పరిశోధనా పత్రాలు అందించడంతోపాటు, పరిశోధన అభివృద్ధి మక్కువ, ఆసక్తి పెరుగుతుందన్నారు. కన్వీనర్ కన్వీనర్లు ఆచార్య పి. జ్యోత్స్న, ఆచార్య ఆర్. జయ మాధురిలు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను పంపించేందుకు సువర్ణ అవకాశం ఉందన్నారు. సదస్సు బ్రౌచర్ ను మహిళా వర్సిటీ వెబ్సైట్లోని అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సువర్ణలతాదేవి,ఆచార్య ఆర్. ఉష, ఆచార్య చండీ కుమారి, ఆచార్య ఎన్.జాన్ సుష్మ, ఆచార్య బి. కిషోరి పాల్గొన్నారు.

స్పాట్ ఎర్త్ రాడ్లు పంపిణీ చేస్తున్న ఏఈ వాసుదేవయ్య

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి: ఏఈ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య తెలిపారు. గతంలో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి రోడ్డు కంటే దిగువ స్థాయిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద చిన్న పిల్లలు పశువులకు అంది ప్రమాదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నందువల్ల వాటిని మరింత ఎత్తులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పేడు వ్యాస నగర్ సమీపంలో ఏర్పేడు - వెంకటగిరి మార్గం లోనూ, కోబాక మార్గంలోనూ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తు పెంచి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో విద్యుత్ శాఖ లైన్‌మ్యాన్ గురశాల బాలసుబ్రమణ్యం, అసిస్టెంట్ లైన్‌మ్యాన్ రమణ పనులు చేపట్టారు. దీంతో పాటు విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా స్టార్ట్ లను కూడా జేఎల్ఎం2 నవీన్ కు అందించారు. ఎక్కడైనా ప్రమాదాల జరిగే అవకాశం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏఈ వాసుదేవయ్య కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి -తిరుమల: టిఎస్ఎన్‌పురం శ్రీ చైతన్య పాఠశాలలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ ముఖ్య అతిథిగా విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ పండుగను పిల్లలందరూ ఎంతో సంతోషంగా కళ్లకు కట్టినట్టు చూసి ఆనందించారు. దసరా పండుగలో భాగంగా బొమ్మల కొలువును కూడా ప్రతిష్టించారు. ఈ పండగలో బొమ్మల కొలువు ప్రత్యేకతను విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ వివరంగా వివరించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, డీన్ రాజశేఖర్ ఉపాధ్యాయని ఉపాధ్యా యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్వేచ్ఛ కోసం అడుగులు : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాము వేసే ప్రతి అడుగు స్వేచ్ఛ కోసం వేసేవని డిఆర్‌డిఎ పీడీ జ్యోతి అన్నారు. శనివారం 'స్వేచ్ఛ కోసం నడక' అనే బృహత్తరమైన సైలెంట్ వాక్‌ను పరివర్తన సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్‌పల్లి డిఆర్‌డిఎ కార్యాలయ ప్రాంగణం నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. డిఆర్‌డిఎ పీడీ, సిఐ జెండా ఊపి ప్రారంభించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని పరివర్తన సేవా సంస్థ అధ్యక్షులు పల్లం అమర్నాథ్ తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ ఏడి జ్యోతి మాట్లాడుతూ ఇది స్వాతంత్ర్యం కోసం తాము నడిచే నడకని, న్యాయం, గౌరవం కోసం నడిచే నడకన్నారు. ప్రతి అడుగులో బానిసత్వాన్ని నిర్మూలిస్తామన్నారు. బానిసత్వం లేని ప్రపంచం సాధ్యమేనని, మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తోందన్నారు. స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందన్నారు. తిరుపతి దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శరత్‌చంద్ర, పరివర్తన సేవా సంస్థ సభ్యులు పి.వెంకటేష్, కె.కుమార్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ సొసైటీ సెక్రటరీ ఆర్ఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనసేనపై అక్రమ కేసులకు సిఐటియు ఖండన

తిరుపతి టౌన్ : తిరుపతిలో మీడియా సమావేశం జరుగుతుండగా అక్రమంగా ప్రెస్ క్లబ్ లోకి చొరబడి ముఖ్యమంత్రిని విమర్శించారన్న ఒకే ఒక్క కారణంతో తీవ్రమైన నాలుగు రకాల ఐపిసి సెక్షన్లు మహిళలపై నమోదు చేసి, హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన తిరుపతి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను హరించడానికి వైసిపి ప్రభుత్వం పూనుకోవడం దారుణమని విమర్శించారు. గతంలో టిడిపి కార్యకర్తలు దిష్టిబొమ్మను దహనం చేశారని హత్యా ప్రయత్నం కేసులు పెట్టారని, ఇప్పుడు మహిళలన్న కనీస విచక్షణ మరిచిపోయి హత్యాయత్నం కేసు నమోదు చేయడం ప్రభుత్వం దుందుడుకుతనాన్ని, నిర్బంధ తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

దసరాకు ఊరు వెళ్లేవారు పోలీసులకు తెలపాలి: ఎస్ఐ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: దసరా పండుగకు సొంతగ్రామాలకు వెళ్లేవారు పోలీసులకు తెలిపి వెళ్లాలని ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు. ఎస్ఐ వెంకట నరసింహం బుచ్చినాయుడు కండ్రిగ ప్రజలకు పలు సూచనలు చేశారు. దసరా సందర్భంగా స్వగ్రామానికి వెళ్లేవారు తప్పకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలిపి వెళ్లాలన్నారు. లేదంటే తిరిగి వచ్చాక కంగుతినే పరిస్థితి ఎదురు కావచ్చన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంటుందన్నారు. గతంలో పండుగలకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లిన వారి ఇళ్లలో దొంగలు మొత్తం దోచుకుపోయిన ఘటనలు ఉన్నాయని, తరచూ పండుగల సమయంలో ఇలాంటి సంఘటనలు జరుతున్నాయని తిరిగి వచ్చాక దొంగతనంపై ఫిర్యాదులు అధికంగా అందుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ బాలకృష్ణ, రీగన్ సురేష్, శరత్ యాకోబు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహ గర్జన గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు రూరల్: నూర్ బాషాల ఆశయ సాధనాల కోసం అక్టోబర్ 29 వ తేది ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కాలేజీ రాష్ట్ర నూరుబాషా సంఘం ఆధ్వర్యంలో సింహగర్జన సభను పురస్కరించుకుని శనివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సలీమ్ భాయ్ మాట్లాడుతూ సింహ గర్జన సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి నూర్ బాషా ప్రతినిధులు, నూరుబాషా సోదరులు, మహిళలు హాజరవుతున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల నాయకులు, నగర, జిల్లా, మహిళా, యూత్ కమిటీ, రాష్ట్ర నాయకులందరూ హాజరై ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. చట్ట సభలలో నూర్ బాషాలకు అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మైనారిటీ పదవులలో వర్గీకరణ దామాషా ప్రకారం నూర్ బాషాలకు పదవులు కేటాయించాలన్నారు. చట్ట సభలలో ఏ పార్టీ నూరు బాషాలకు అవకాశం ఇస్తుందో ఆ పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ దిల్ షార్, గూడూరు మండల అధ్యక్షులు షేక్, చాంద్ బాషా, గూడూరు యూత్ అధ్యక్షులు షేక్ బాబా బాయ్, గూడూరు యూత్ ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీమ్, షేక్. జిలాని, షేక్ ఖాదర్ బాబా, షేక్ ఖయ్యూమ్, టైలర్ షేక్ చాంద్ బాషా, షేక్ సుబాన్, షేక్ దూది నజీర్, షేక్, ఖాదర్ బాషా, షేక్ సలీమ్, షేక్ జైనుద్దీన్ పాల్గొన్నారు.

అడవుల్లో 'డ్రోన్' సాయంతో విత్తనాల వెదజల్లేత

వృక్షసాంద్రతను మరింత పెంచడానికే : డీఎఫ్ఓ సతీష్ రెడ్డి

డ్రోన్ సాయంతో విత్తనాలు వెదజల్లేందుకు సిద్ధం చేస్తున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అడవుల్లో వృక్ష సాంద్రత తక్కువగా ఉన్న ప్రాంతంలో మరింతగా పెంచుతూ పచ్చదనాన్ని పెంపొందించడానికి డ్రోన్ సహాయంతో విత్తనాల వెదజల్లే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం శేషాచలం అటవీ పరిధిలోని మామండూరు అటవీ ప్రాంతంలో గుబ్బ కోల్డ్ స్టోరేజ్, నూజివీడు సీడ్స్ వారి సహకారంతో మారుతీ డ్రోన్స్ టెక్నాలజీ పార్టనర్ గా మామూలు అటవీ ప్రాంతంలోని 10 ఎకరాల విస్తీర్ణంలో 50 వేల సీడ్ బాల్స్‌ను డ్రోన్ ద్వారా వెదజల్లారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అటవీ ప్రాంతంలో దట్టంగా వృక్షాలను నెలకొల్పాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డిఎఫ్ఓ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ డ్రోన్స్ ద్వారా రావి, జామ వంటి విత్తనాలను చల్లామన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా 10 లక్షల సీడ్ బాల్స్ ను 25 అటవీ ప్రాంతాలలో వెదజల్లామన్నారు. పనబాకం, ముంగిలిపట్టు, కాశిపెంట్ల తదితర ప్రాంతాలలో సీడ్ బాల్స్ ను అడవిలో డ్రోన్ ద్వారా వేశామన్నారు. ఈ కార్యక్రమానికి పనపాకం ఫారెస్ట్ రేంజ్ అధికారి మాధవి వారి సిబ్బంది తగిన సహాయ సహకారాలతో విజయవంతంగా సీడ్ బాల్స్ ను వెదజల్లారని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసరావు, డిఆర్ఓ చినబాబు, బీట్ ఆఫీసర్లు అనిత, జ్యోతి, మునెమ్మ, జమున పాల్గొన్నారు.

అణచివేతకే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో వైసిపి శాశ్వత ప్రభుత్వాన్ని నడిపేస్తుందని అధికారులు భావిస్తున్నారని, అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని ప్రభుత్వాధికారులు గుర్తుంచుకోవాలని తిరుపతి మాజీ శాసనసభ్యులు మన్నూరు సుగుణమ్మ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పక్షాలను అణిచివేయడానికి చిన్నపాటి కారణా లైన 307 సెక్షన్లతో కేసులు నమోదు చేయడం పోలీసుల అత్యుత్సాహానికి నిదర్శన మన్నారు. బాధితుల గోడు చెప్పుకోవడానికి ఓ దేవాలయంగా ఉన్న ప్రెస్ క్లబ్ లోకి పోలీసులు రంగ ప్రవేశం చేసి అరెస్టులు చేస్తున్నారంటే రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను కూడా హరించడానికి వెనుకాడడం లేదన్నారు. జనసేన వీర మహిళలను ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలోకి వచ్చి అరెస్టు చేయడానికి తీవ్రంగా పరిగణిస్తూ దీనిపై ఎస్‌పికి ఫిర్యాదు చేయ నున్నామన్నారు. ఇటీవల 307 సెక్షన్లతో నమోదు చేసిన కేసులు కోర్టులో వీగిపోయాయని, ఇకనైనా పోలీసులు వైసీపీ సెక్షన్లు కాకుండా ఐపిసి సెక్షన్లు ఫాలో కావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి పక్షా లు లేకుండా చేయాలని కుట్రతో అధికార వైసిపి నిత్యం అక్రమ కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుప తి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహా యాదవ్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షు లు పసుపు లేటి హరిప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, కిరణ్ రాయల్, రాజారెడ్డి, మనోహరాచారి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పోలీసుల అదుపులో నిందితులు

గంజాయి రవాణా పట్టివేత

ప్రజాశక్తి - గూడూరు: తిరుపతి ఎస్పి పి పరమేశ్వర్ రెడ్డి తిరుపతి జిల్లా డిఎస్ఇఓ (ఏఎస్పి, సెబ్) ఎ రాజేంద్ర ఆదేశాల మేరకు గూడూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో గంజా యిపై గూడూరు సెబ్ టీమ్ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో గంజాయి కలిగి ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని (ఎ1)ను అరెస్టుచేసి అతని వద్ద నుండి 3 కేజీ ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మరో ఇద్దరు వ్యక్తులను (ఏ 2, ఏ 3)లను గుర్తించారు. ఒడిశాలోని మల్కాన్ గిరికి చెందిన ఈశ్వర్ మడ్కామి ఎ1గాను, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు గ్రామానికి చెందిన మౌలాలి అలియాస్ ఆలీ ఎ2గా, బెంగళూరుకు చెందిన మనోజ్‌ను ఎ3గాగుర్తించారు. ఎ2, ఎ3 లు ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు. నిందితుల కథనం మేరకు.. స్నేహితుడైన (ఏ 2) మౌలాలి వద్ద నుండి (3) కేజీల గంజాయిని తీసుకుని బెంగళూరులో ఉన్న ఎ3 మనోజ్‌కు గంజాయిని చేరవేస్తే ఈశ్వర్ కు మౌలాలి అనే వ్యక్తి రూ.5వేలు ఇస్తాడని తెలిపారు. బెంగుళూరులో ఈ గంజాయి విలువ ఒక్కో కేజీ 20 వేల రూపాయలు ఉంటుందని అంచనా. దీని విలువ మొత్తం 60 వేల రూపాయలు ఉంటుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న అందరినీ త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలపవచ్చున్నారు. ఈ దాడులలో గూడూరు సెబ్ టీమ్ గూడూరు సెబ్ టీం బీ సీఐ , పి విజయ్‌కుమార్, ఎస్ఐ ఏ శేషమ్మ, హెచ్ సి యమ్ కిరణ్ సింగ్, పి రమేష్ , ఎస్ కె బాషా, టీజీ ఆనందబాబును ఉన్నతాధికారులు అభినందించారు.

గాలి భాను ప్రకాష్‌ని పరామర్శించిన నాయకులు


గాలి భానుప్రకాష్‌ను పరామర్శిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్ ను తిరుపతిలోని ఆయన నివాసంలో టిడిపి నాయ కులు, జన సేన నాయకులు పలువురు శనివారం కలిసి పరామర్శించారు. ఈ సంద ర్భంగా నరసింహ యాదవ్, పుత్తూరు డిఎస్ గణేష్, అశోక్, కరుణ యాదవ్, సర్పంచి బొబ్బిలి యాదవ్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, పుత్తూరు నాయకులు మహేష్, గోపి రాయల్ మాట్లాడుతూ భాను ప్రకాష్‌పై కొందరు వైసిపి నాయకులు దాడి చేయడం అన్యాయమన్నారు. ఓటమి భయంతోనే ఇలాంటి దాడులు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు జనసేన నాయకులు, ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజింగ్ సెక్రటరీ పి గోపి రాయల్, జనసేన నాయకులు, తిరుపతి జిల్లా కాపు సంక్షేమ యూత్ అధ్యక్షుడు శ్రీరాం గోపి, కాపు సంక్షేమ సేన మహిళా నాయకురాలు లక్ష్మి, ఏపీ రాష్ట్ర కాపు రైతు విభాగం ఉపాధ్యక్షులు, పుత్తూరు జనసేన నాయకులు జి కృష్ణయ్య పాల్గొన్నారు.

బాబుని సిఎంని చేద్దాం: టిడిపి

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి అన్నారు. బాబు కోసం మేము సైతం లో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని 2, 3వవార్డుల్లో పర్యటించారు. చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం రాజకీయ కక్ష తీర్చుకుంటోందని వాపోయారు. జైల్లో సరైన వైద్యం కూడా బాబుకి అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాబును కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కూలి సన్నీ, దిలీప్ కుమార్, గోవింద్, శ్రీకాంత్, మురళి, దశరధాచారి, రేణుకమ్మ, కంఠ రమేష్, చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, మునిరాజ నాయుడు, చలపతి నాయుడు, కామేష్ యాదవ్, చక్రాల ఉష, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

'రవీంద్ర భారతి'లో దసరా సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కొర్లగుంట మారుతి నగర్ లో ఉన్న రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి దసరా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ బి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ హిందూ సంప్రదాయాన్ని పాటించాలని అన్నారు. భారతీయ సంప్రదాయాన్ని ఆచరించడంలో తెలుగువారు ముందున్నారన్నారు. తర్వాత బొమ్మల కొలువులు పెట్టి పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ప్రజాశక్తి -రామచంద్రపురం: దేవి నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని సిరామాపురం లోని బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో ఆదివారం నుంచి 9 రోజులు పాటు జరిగే దేవి నవరాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేశారు. రాయలచెరువు కట్ట సమీపాన ఉన్న శ్రీ శక్తి పీఠం, రాయల చెరువు కట్ట కింద ఉన్న భవాని శంకరాలయంలో ఉత్సవాలకు ఆలయ నిర్వహకులు విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్ళు, మామిడి తోరణాలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి కనక దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమ నిర్వాహకులు రాంప్రకాష్, రాధాకృష్ణన్లు తెలిపారు. ఈ దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు, నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ మద్యం షాపు ఏర్పాటుపై దళిత నాయకుల ఆందోళన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి మధ్యలో సర్కారి మద్యం దుకాణం ఏర్పాటు పై స్థానిక దళిత నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో సుమారు 600 మంది పైగా విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని.ప్రతి ఆదివారం వారిని చూసేందుకు వారి తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో మహిళలు ఈ రహదారిపై వెళుతున్నారని వాపోయారు. అయితే ఈ ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక వైసిపి నాయకులు స్పందించి మద్యం దుకాణం వేరే చోట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కోట బిట్ వన్ ఎంపీటీసీ దారా సురేష్, బిట్ 3 ఎంపీటీసీ షంషుద్దీన్, కొత్తపాలెం ఎంపీటీసీ నారాయణ, టీడీపీ నాయకులు అనీల్, తిరుమూరు మురళి, విన్నమాల అనొక్, వాటంభేటీ చెంగల్ రావు పాల్గొన్నారు.